


# గాయత్రి

## పెదపూడి రాజ్యలక్ష్మీదేవి

**3**

తమ యింట్లోంచి మేడమ్‌ని గమనిస్తున్న గణపతి యింత స్వల్పకాలంలో గాయత్రీ మేడమ్ ప్రేమాభిమానాలను దోచుకున్న మురారిమీద యీర్ష్యతో కుతకుతలాడుతున్నాడు. వాళ్ళిద్దరినీ పరిశీలించడమే పనిగా పెట్టుకున్న గణపతి యీ మధ్య చదువు కూడా సరిగా చదవలేకపోతున్నాడు.

మురారి రాగానే వికసిత వదనంతో అతడికి ఎదురుగా వెళ్ళింది గాయత్రి. పలకరింపులు అయ్యాక గాయత్రి యింటికి తాళం వేసింది. వాళ్ళిద్దరూ మెట్లుదిగి వీధిలోకి వెళ్ళిపోయారు.

వాళ్ళని చాటునుంచి గమనిస్తున్న గణపతి మామ్మతో చెప్పి వీధిలోకి వచ్చి వాళ్ళ మాటలు వింటూ వాళ్ళకి కొంచం ఎడంగా నడవసాగాడు.

ఎంతో వుత్సాహంగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్న ఆ జంట రోడ్డు మీద వచ్చే పోయే వారి దృష్టి నాకర్షించడం గమనించాడు గణపతి.

వేణుగోపాలస్వామి ఆలయం సమీపించింది.

ఆలయం లోకి వెళ్ళి గుడిగంటలు మ్రోగించి వేణుగోపాలుడిని దర్శించుకున్నాక, పూజారి ఇచ్చిన తీర్థం తీసుకుని ఆలయం మెట్ల మీద కాసేపు కూర్చున్నారు.

వాళ్ళ కదలికలు గమనిస్తూ వారి మాటలు వింటూ వారి వెనుక వున్న స్తంభం చాటున నిలబడ్డాడు గణపతి.

"ఘంటారావం వింటూ ఈ మెట్ల మీద యిలా కూర్చుంటే మనస్సు అవ్యక్తమైన ఆనందానికి లోనవుతోంది." అంది గాయత్రి.

"దాన్నేమంటారో తెలుసా?" నవ్వుతూ అన్నాడు మురారి.

"భక్తి!"

"ఊహూ"

"మరి!" కుతూహలంగా చూసింది గాయత్రి.

"డివైన్‌లౌ"

"మీ సాహిత్య పరిభాషలోనా?" చిలిపిగా చూసింది.

"అవును ఫిజికల్ లౌ నరకానికి దారితీస్తుంది. కాని, డివైన్‌లౌ అంటే తెలుగులో దివ్యప్రేమ లేక అధ్యాత్మిక ప్రేమ చిత్త శాంతికి దారితీస్తుంది, భగవంతుడిని ప్రేమిస్తే ఆత్మానందం కలుగుతుంది. అందుకే కాబోలు మీరా....రాధ,ఆండాళ్ వేణుగాన లోలుడిని ఆరాధించి తరించారు." గాయత్రి కళ్ళు కాంతితో తళతళ్ళాడాయి.

"ఈ దివ్యప్రేమ గురించి మన పూర్వులు ఎంత చక్కటి వాక్యాలు రాసారు! స్తోత్రాలు, శ్లోకాలు, పద్యాలూ రాసారు! శంకరాచార్యుల సౌందర్యలహరి ఎంత బాగుంటుంది!"

"ఏమిటీవేళ తన్మయత్వంతో దివ్య ప్రేమ గురించి మాట్లాడుతున్నారు! కొంపతీసి మీరు కూడా పెళ్ళీ పెడాకులు మానేసి శంకరాచార్యుల వారిలా సన్యసించి దివ్య ప్రేమను ప్రచారం చేస్తారా ఏమిటి?" హాస్యంగా అంది గాయత్రి.

"అంత గొప్పవాడిని కాను నేను." మురారి నవ్వాడు.

"అమ్మయ్య. అయితే పెళ్ళి చేసుకుంటారన్న మాట. మరయితే పెళ్ళెప్పుడూ? పిల్లని చూసారా?"

"నేను పెళ్ళంటూ చేసుకుంటే ఆ పిల్లను మీరే సెలెక్ట్ చేద్దురుగాని. మీరు చూపించిన పిల్లనే చేసుకుంటాను. సరేనా?"

"థ్యాంక్స్! లేవండి ప్రొద్దుపోతోంది. కాసేపు నది వొడ్డున కూర్చుని వెళ్ళిపోదాం." అంటూ నవ్వుతూ లేచి నిలబడింది గాయత్రి.

మురారి కూడా లేచాడు.

వాళ్ళిద్దరి వెనుక కొంత దూరంలో గణపతి నడవసాగాడు. నది వొడ్డుకి చేరేసరికి సూర్యాస్తమయం అయింది.

శోభనం గది గుమ్మంలో నిలబడి సిగ్గుపడుతున్న కొత్త పెళ్ళికూతురులా వుంది అరుణిమను పులుముకున్న ఆకాశం, పక్షులు జంటలు జంటలుగా ఎగిరిపోతున్నాయి, గూళ్ళకి చేరుకోవాలనే ఆత్రంతో.




ఇద్దరూ యిసుకలో కూర్చున్నారు. వాళ్ళు గమనించకుండా వెనుకవైపున కాస్త దూరంలో వాళ్ళవైపు వీపుపెట్టి గణపతి కూర్చున్నాడు.

"గాయత్రీ!" అంటూ ఆత్రంగా పిలిచాడు మురారి గాయత్రి చేతిని తన చేతిలోకి తీసుకుంటూ.

గాయత్రి సిగ్గుతో చేతిని విడిపించుకోవాలని ప్రయత్నించి విఫలురాలైంది.

"నేను మరికొన్ని కవితలు రాసాను." అన్నాడు మురారి గాయత్రి కళ్ళలోకి ఆరాధనగా చూస్తూ.

"వూ....!" అంది గాయత్రి సిగ్గుతో కళ్ళు వాల్చుకుని.

"తెచ్చాను. చూపించనా?"

"వూ....!"

జేబులో చెయ్యిపెట్టి కాగితాలు తీస్తున్న సమయంలో చెయ్యి విడిపించుకుని ఎడంగా జరిగి కూర్చుంది గాయత్రి.

కాగితాలను అందివ్వబోతూంటే, "చదవండి. వింటాను," అంది గాయత్రి చెంపకు చెయ్యానించుకుని చిరునవ్వుతో.

"నేనా – చదవనా?" అంటూ తడబడి – "మీరే చదివి ఎలా వున్నాయో చెప్పండి." అంటూ కాగితాలు గాయత్రి చేతికందించాడు మురారి.

కాగితాలు చదవబోతూ ఒకసారి తలయెత్తి మురారి మొహంలోకి పరిశీలనగా చూసింది గాయత్రి.

అతడి మొహంలో ఎందుకో తెలియని బెదురు.

కళ్ళలో ఏదో అభ్యర్ధన, ఏదో తెలియని ఆకాంక్ష.

వాళ్ళ మాటలు వింటూ మొహం ఒకప్రక్కగా వాల్చి వోరగంట వాళ్ళని గమనిస్తున్నాడు గణపతి.

మురారి అవస్థ గమనించిన గాయత్రి పెదవుల మీద చిరునవ్వు కురిసింది.

ఆమె కళ్ళు వాక్యాలమీదికి పరిగెత్తాయి.

'చెలీ!

'నాదొక చిన్న విన్నపం అవధరిస్తావా?' అంటూ మొదలైన ఆ కవిత చివరకు.

నీ అణువణువునీ స్పృశించే పన్నీరునేనై పరవశించాలని ఒక కోరిక.... వెర్రికోరిక.

చెలీ అనుగ్రహిస్తావా, ఆగ్రహిస్తావా?'

గాయత్రి చెక్కిళ్ళు సిగ్గుతో ఎర్రబారాయి.

ఒక పురుషుడు వ్రాసి యిచ్చిన ప్రేమలేఖను చదవడం ఆమెకదే మొదటిసారి.

మిగతా కవితలు కూడా అదే పద్ధతిలో వున్నాయి.

చదవడం పూర్తిచేసి కాగితాలు తిరిగి యిచ్చేసింది గాయత్రి.

"నా కవితలపట్ల మీ అభిప్రాయం?" ఆర్తోక్తితో ఆగిపోయాడు. మురారి.

"ప్రేమకవుల పంథాలోనే మీరూ నడుస్తున్నారు." గాయత్రి మాటల్లో చిలిపితనం తొంగి చూసింది.

"విశ్వజనీనమైన ప్రేమ కవిత్వానికి వస్తువు కాదంటారా. ప్రపంచంలోని ప్రతి సమస్యా పరిష్కారం కాగానే దానికి వున్న విలువ పడిపోతుంది. విషయం పాతబడిపోతుంది. కాని ప్రేమ అలా కాదే! జరామృత్యువులు సోకనిది. అమరమైనది. ఈ జగత్తులో స్త్రీ పురుషులున్నంత వరకు అది సత్యమై నిత్యమై భగవత్స్వరూపంగా నిలుస్తుంది." అన్నాడు మురారి ఆవేశంగా.

అతడి ఆవేశం చూస్తూంటే గాయత్రికి నవ్వు వచ్చింది.

"కవితలన్నీ బాగున్నాయి. ఏదేనా పత్రిక్కి పంపిద్దామనుకుంటున్నారా?" మనసులోని తడబాటు మొహం మీదికి రాకుండా జాగ్రత్త పడుతూ

అంది గాయత్రి.

"ఇంకా ఏమీ అనుకోలేదు. ఇన్స్పిరేషన్ వచ్చి రాసేసాను. అంతే" అన్నాడు మురారి.

"ఇంతకీ మీకింతటి ప్రోత్సాహం యిచ్చిన మీ కవితాసుందరి ఎవరో?" కుతూహలంగా అడిగింది గాయత్రి.

"చెప్పమంటారా?" గాయత్రి కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నాడు మురారి.

"చెప్పండి!" నవ్వుతూ అంది గాయత్రి.

"నా చెంప ఛెళ్ళుమనిపించనని మాటయిస్తే చెప్తాను."

"అదేమిటి...?" చకితురాలైంది గాయత్రి.

"నా వూహాసుందరి మీరే కాబట్టి....నా కవితలన్నీ మీ చుట్టూ అల్లుకున్నాను కాబట్టి...."

ఒక్కక్షణం గాయత్రి హృదయం లయ తప్పింది. వళ్ళంతా చిరుచెమటలు పట్టి సన్నగా వణికింది.

మురారి అంత సూటిగా అంత నిర్భయంగా మాట్లాడతాడనుకోలేదు గాయత్రి. అసలు తను ఎందుకలా మాట్లాడానా అనుకుంది. తను మళ్ళీ ఆ ప్రస్తావన ఎత్తకుండా వుండవలసింది అనుకుంది.

తన మాటలకు తల వంచుకుని మౌనంగా వుండిపోయిన గాయత్రిని చూస్తూ, "నిజం గాయత్రిగారూ—కులం దృష్ట్యా వుపనయనానికి 'అనహర్హుటీ నయినా గాయత్రి మాత్రం కంఠో పాటమే నాకు. మానసికంగా ఆ దేవిని ప్రతినిత్యం వుపాసిస్తూనే వుంటాను. ఆ దేవి సాక్షిగా చెపుతున్నాను. మిమ్మల్ని చూసిన క్షణమే మీ రూపు నా హృదయ మందిరంలో ప్రతిష్ఠితమైంది. నన్ననుగ్రహించడానికి రూపుదాల్చి వచ్చిన గాయత్రీ దేవిలా కనిపించారు మీరు. మీతో శాశ్వతమైన బంధాన్ని ఏర్పరచుకోవాలని నా ఆకాంక్ష. మీరు అంగీకరిస్తే - మీకు అభ్యంతరం లేదంటే—" అంటూ అర్థోక్తిలోగా ఆగిపోయాడు మురారి.

"నన్ను-నన్ను-ఆలోచించుకోనివ్వండి." అంది గాయత్రి.

నేల మీద గడ్డిపరకను వేళ్ళతో పెరికి పళ్ళ మధ్య పెట్టుకుని కొరుకుతూ పరధ్యానంగా వుండిపోయిన గాయత్రిని చూస్తూ "మీ నాన్నగారి అనుమతి తీసుకోవాలంటారా? ఒక రోజు మనిద్దరం కలిసి మీ వూరు వెడదాం" అన్నాడు మురారి మృదువుగా.

పరధ్యానంగానే వూకొట్టింది గాయత్రి.

"నాస్థితి గురించి మీకేవిధమైన సందేహం అవసరం లేదు. పెద్ద వుద్యోగాలు చెయ్యక పోయినా తినడానికి వుండటానికి లోటులేదు. పది మందికి పెట్టగల స్తోమతు వుంది. ఈ వూళ్ళో సొంత యిల్లు, పదెకరాలు ధాన్యం పండేపొలం—మామిడితోట వున్నాయి. మీకు తెలుసుగా నాన్నగారు పోయి నాలుగేళ్ళవుతోంది. అమ్మ నామాట ఎప్పుడూ కాదనరు."

గాయత్రి మౌనంగా వుండిపోయింది.

కాని-కులానికి ప్రాధాన్యత యిచ్చే తన తండ్రి తమ పెళ్ళికి ఒప్పుకుంటాడా? కులం కోసం



నిమ్మచెట్టుకు వుండే చిన్న ముళ్ళు తీసి డెట్టాల్‌లో కడిగి ఆ ముల్లుతో బాగా ముదిరిన మొటిమల మధ్య భాగంలో నెమ్మదిగా పొడిస్తే వాటినుంచి ద్రవం వస్తుంది. దానిని శుభ్రమైన దూదితో తుడవాలి. దూదిలో కొద్దిగా టింక్చర్ బెన్‌జైన్ వేసి వాటిమీద నొక్కి పెట్టాలి. ఆ తర్వాత స్నానపుపొడితో ముఖం కడుక్కుంటే మొటిమలు వాటంతట అవే పోతాయి.

తండ్రి కోసం తను తనంటే ప్రాణం పెట్టే మురారిని ఒదులుకోగలదా! అతడు లేకుండా మనుగడ సాగించగలదా! ఇంత స్వల్ప వ్యవధిలో మురారి తన హృదయానికెంత దగ్గరగా వచ్చాడు! ఆలోచిస్తున్న గాయత్రికి ఏమీ పాలుబోవడం లేదు.

"మీ తల్లి తండ్రులకేమన్నా అభ్యంతరం వుందా—? కులాంతర వివాహాన్ని మీ నాన్నగారు వ్యతిరేకిస్తారా?" మౌనంగా వుండిపోయిన గాయత్రిని చూసి సందేహం వచ్చిన మురారి ప్రశ్నించాడు.

"నాకు తల్లి లేదు చిన్నతనంలోనే ఆ అదృష్టానికి దూరమయ్యాను. మానాన్నగారు మళ్ళీ పెళ్ళి చేసుకున్నారు. మా కుటుంబ పరిస్థితులెలా వుంటాయో మీరు వూహించుకోవచ్చు." అంటూ నిట్టూర్చింది గాయత్రి.

"ఏమైనా యీ విషయం మీ నాన్నగారితో మాట్లాడతాను, ఆయన వొప్పుకుంటే సరేసరి—లేకపోతే...యింతకీ మీకు ఇష్టమేనా? నా గొడవలో పడి మీ మనస్సు తెలుసుకోనే లేదు." అన్నాడు మురారి ఆరాటంగా.

గాయత్రి తల ఎత్తి మురారి వైపు చూసి చిరునవ్వు నవ్వింది. శతకోటి జ్యోత్స్నలొక్క పరి విరినట్లుగా హృదయం పై అమృతం వర్షించినట్లుగా అనుభూతి చెందాడు మురారి.

ఒక్కసారి ఆమె చెయ్యి అందుకుని పెదవులకు ఆనించుకున్నాడు.

ఇద్దరూ ఆస్థితిలో ఒక నిముషం సేపు మౌనంగా వుండి పోయారు.

గాయత్రి నెమ్మదిగా చేతిని వెనక్కి లాక్కుని లేచి నిలబడింది. "చీకటి పడింది. ఇంక వెడదాం" అంటూ.

వాళ్ళిద్దర్నీ గమనిస్తున్న గణపతి హృదయం బాధతో నిండిపోయింది. అంధకారవృతమైన ఈ ప్రపంచంలో తను ఏకాకిగా నిలబడి పోయిన భావన కలిగింది ఆ లేతమనస్సులో. వుసూరుమంటూ లేచి నీరసంగా అడుగులు వేసాడు.

ఇల్లు యింకా ఫర్లాంగు దూరం వుందనగా నోట్లో లంక పొగాకు చుట్టపెట్టుకున్న కరణంగారు ఎదురయ్యారు.

"ఎక్కడినుంచేమిటి వస్తున్నారు?" అంటూ గాయత్రిని ప్రశ్నించి మురారి వైపొకసారి ఎగాదిగా చూసాడు.

"అలా వేణుగోపాలస్వామి గుడికి వెళ్ళి వస్తున్నాము." అన్నాడు మురారి.

"నేను మిమ్మల్ని అడగలేదే! పంతులమ్మని అడుగుతున్నాను. ఇదుగో గాయత్రీ! నువ్వు యీ వూరు అసలు ఎందుకు వచ్చావు? వుద్యోగం చేసుకుందుకు – అంతేకాని వయసులో వున్న కుర్రాళ్ళని వెంటేసుకు తిరగడానికి కాదు. అవునా?"

"కరణంగారూ!" గద్దించాడు కోపంగా మురారి. "మాటలు జాగ్రత్తగా రానీండి."

"ఏమిటీ, వున్నమాటంటే వులుకెక్కువట, నన్నే ఎదిరిస్తున్నావా? నన్నుకాదని యింతవరకు యీ వూళ్ళో ఎవరూ బ్రతికి బట్టకట్టలేదు." అన్నాడు కరణం మీసం మెలేస్తూ కోపంగా.

"మీరు అనవసరంగా మాటలు పెంచుతున్నారు, ఇది మా స్వంత విషయం. నేను ఏం చేసేది మీ అనుమతి తీసుకుని చెయ్యాలా! మీరు వూరికి కరణం కావచ్చు కాని మామీద అధికారం చూపించే హక్కు లేదు మీకు." అంది గాయత్రి తీవ్రంగా.

"పదండి గాయత్రిగారూ ఆయనతో మనకి వాదన ఎందుకు?" అంటూ ముందుకు నడిచాడు మురారి.

కోపంతో పళ్ళు పటపట కొరికాడు కరణం.

"ఒక చిన్న బడిలో పనిచేస్తున్న పంతులమ్మకి ఎంత పొగరు! చూస్తూ వుండు... నువ్వు వలవల ఏడ్చేలా చెయ్యకపోతే నాపేరు నాగరాజే కాదు."

కరణం చేసిన శపథం మురారి విన్నాడు గాయత్రి కూడా వింది.

"మనం అనవసరంగా అతడితో గొడవ పెట్టుకున్నామేమో అనిపిస్తోంది. పేరుకి తగ్గ స్వభావం అతడిది. పగబట్టాడంటే అతడిది పాము పగే! ఈ వూళ్ళో ఎన్నో సంసారాలు అతనివల్ల నాశనమయ్యాయి."

"అయినా అతడు మననేం చెయ్యగలడు?" సాలోచనగా అంది గాయత్రి. "మహా అయితే నా వుద్యోగం తీయిస్తాడు. పోనివ్వండి, నాకేం భయంలేదు."

"ఎందుకేనా మంచిది. కాస్త జాగ్రత్తగా వుండండి." అన్నాడు మురారి అంతకన్న ఎలా చెప్పాలో అర్థం కాక.

"అంటే...?" అంది గాయత్రి.

"ఏమో! తెగించినవాడు ఏమేనా చెయ్యవచ్చు. ఆ నాగరాజుకి ఎవరి భయమూ లేదు. రాత్రిపూట వంటరిగా బయటికి వెళ్ళకండి." మురారి గొంతులో ఆరాటం బాధ ధ్వనించాయి.


మురారి మనస్సులోని భయం అర్థమైన గాయత్రి తల వంచుకుని క్రింది పెదవిని పంటితో నొక్కుతూ వుండిపోయింది.

ఆమె మనస్సు యిదమిద్ధమని తెలియని భయంతో నిండిపోయింది.

వెళ్ళేటప్పుడు వున్న వుత్సాహంలో ఆవగింజంతయినా వచ్చేటప్పుడు మిగల లేదు.

వీధి మెట్లెక్కి తలుపు తాళం తీసింది గాయత్రి.

"మరి నే వెడతాను సెలవా?" అన్నాడు మురారి.




"ఒక్కనిముషం లోపలికి రండి. వేడిగా ఒక కప్పు పాలు తాగి వెడుదురు గాని." అంది గాయత్రి తలుపు తెరుస్తూ.

కాదనకుండా వెంటనే లోపలికి వెళ్ళాడు మురారి.

వొంట్లోని శక్తంతా ఎవరో లాగేసినట్లు నడుస్తూ గణపతి యింట్లోకి వచ్చారు.

"ఏంరా గణపతీ యింతాలస్యమైయింది—? ఎక్కడికి వెళ్ళావు?" ఆరాటంగా ప్రశ్నించారు సీతమ్మగారు.

"చెప్పాను కదుటే మామ్మా అలా తిరిగి వస్తానని" సీతమ్మగారి మీద అకారణంగా విసుక్కున్నాడు గణపతి.

"ఆలస్యమైందేమని అడిగితే అంత కోపం ఎందుకురా? పెద్దదాన్ని నీక్షేమం కోరేదాన్ని కావడం వల్ల ఏదో అడుగుతాను. మరో మారు చెపితే నీ నోటి ముత్యాలు రాలిపోతాయా?" అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయారు సీతమ్మగారు.

గణపతి కాళ్ళూ చేతులూ కడుక్కుని వచ్చాడు.

సీతమ్మగారు భోజనానికి పిలిస్తే వెళ్ళి అన్నం తిని వచ్చి పుస్తకాలు ముందేసుకుని కూర్చున్నాడు.

కళ్ళయితే పుస్తకంలోని వరూధినీ ప్రవరాఖ్యుల సంభాషణకి సంబంధించిన పద్యం వైపు చూస్తున్నాయి కాని మనస్సు అవ్యక్తమైన బాధననుభవిస్తోంది.

'గాయత్రీ మేడమ్! తనకి ఎంత దూరమైపోయింది! అసలు తమ యిద్దరి మధ్యకి ఈ మురారిగాడెందుకు రావాలి? విలన్‌లా వచ్చి ఎంతో మంచిదైన గాయత్రీ మేడమ్ మనస్సును తనవైపు మళ్ళించుకున్నాడు. గాయత్రీమేడమ్ యిక తనతో పూర్వంలా వుండదా? యిక ఎప్పటికీ మురారితోనే స్నేహం చేస్తుందా? గాయత్రీమేడమ్‌తో మాట్లాడకపోతే తనకి పిచ్చెక్కినట్లు వుంటుంది. మురారి పెద్దవాడు కనుక ఆ విషయం భయం లేకుండా చెప్పేసాడు. తను చిన్నవాడు. ఇలాంటి విషయం గాయత్రీ మేడమ్‌తో ఎలా చెప్పగలడు? చెప్పకపోతే ఆమెకెలా అర్థమౌతుంది!'

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయిన గణపతి పుస్తకం మూసేసి లైటు తగ్గించి నిద్రకి వుపక్రమించినా... ఎప్పటికో గాని అతడిని కనికరించ లేదు నిద్రాదేవి.

*

మర్నాడు వుదయం గణపతి పెరట్లో మొహం కడుక్కుంటూ వుంటే గాయత్రి తలుపు తీసుకుని పెరట్లోకి వచ్చింది.

అప్పుడే నిద్రలేచినట్లుంది. విశాల నేత్రాలు బరువుగా వాలిపోతూంటే చెదరిన ముంగురులతో కొంచెం నలిగిన తెల్లటిచీరతో స్వప్న సౌందర్యానికి నిర్వచనంలా వున్న గాయత్రిని చూచిన గణపతి హృదయం వేగంగా స్పందించింది.

త్వర త్వరగా మొహం కడుక్కోసాగాడు.

[సశేషం]